

ఉత్సాహంగా 5కే రన్ 5
6 పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

యాసంగి దిగుబడి వచ్చేనా?



కోనరావుపేటలో ఎండిన పొలాలు



నీళ్లు లేక వెలవెలబోతున్న అన్నపూర్ణ ప్రాజెక్ట్

- అన్నపూర్ణ ప్రాజెక్ట్ కింద నెర్రలు బారుతున్న పొలాలు
- రాజరాజేశ్వర మిడ్ మానేరు నీటి విడుదలపై రైతుల ఆందోళన
- అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో 0.9 టీఎంసీల నీటి మట్టం
- తెగుళ్లతో రైతుల దిగాలు
- యాసంగి క్రాప్ బుకింగ్ సర్వే పూర్తి
- సర్వే నంబర్ల ప్రకారం జియో ట్యాగింగ్
- అత్యధికంగా వరి సాగు 1.73 లక్షల ఎకరాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఎన్నో ఆశలతో యాసంగి సాగు చేసిన రైతుల్లో పంటలు ఎండిపోవడం, తెగుళ్ల సోకడం వంటివి ఆవేదనను నింపుతున్నాయి. జిల్లాలో బోరుబావులు, ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీటి మట్టం పడిపోతుండడంతో యాసంగి సాగు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది. జిల్లాలో యాసంగి సాగుపై వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరించారు. ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. సర్వే నంబర్ల ప్రకారం పంటల వివరాలపై సర్వే చేపట్టారు. పంట విస్తీర్ణం, రైతు వివరాలు, వెబ్‌సైట్‌లో నమోదు చేయడంతో పాటు పంటలను జియో ట్యాగింగ్ చేస్తూ కచ్చితమైన వివరాలను సేకరించారు. ఫొటోలు కూడా అప్‌లోడ్ చేసి కచ్చితమైన లెక్కలను తేల్చారు. కానీ అప్పుడే సాగునీరు అందక పంటలు ఎండిపోతుండడంతో దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో క్రాప్ బుకింగ్ ద్వారా 1.76 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసినట్లు లెక్కలు తేల్చారు. ఇందులో ప్రధానంగా వరి 1.73 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. వరి పొలాలకు నీళ్లు అందని పరిస్థితుల్లో జిల్లాలోని పలు గ్రామాల్లో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పంటలకు సాగునీరు కష్టంగా మారింది. దీనికి తోడుగా మొగిలి పురుగు, అగ్గి తెగులుతో దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● నెర్రలు బారుతున్న 'అన్నపూర్ణ' ఆయకట్టు

తలాపున ప్రాజెక్టులు ఉన్నా పొలాలు నెర్రలు బారుతున్నాయి. ప్రధానంగా ఇల్లంతకుంట మండలంలో యాసంగి సాగుకి సంబంధించి కరువు ఛాయలు రైతులను వెంటాడుతున్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాలకు నీటి హబ్‌గా ఉన్న జిల్లాలోని రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో దిగువ ప్రాజెక్ట్‌లకు నీటిని విడుదల చేయడం లేదు. దీంతో ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద నిర్మించిన అన్నపూర్ణ ప్రాజెక్ట్ నీటి నిల్వ పూర్తిగా తగ్గిపోయి వెలవెలబోతోంది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్ట్‌లో 0.9 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది. ప్రాజెక్ట్‌లో నీరు లేకపోవడంతో భూగర్భ జలాలు పడిపోయాయి. ఇల్లంతకుంట మండలంలో 25,024 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. అన్నపూర్ణ ప్రాజెక్ట్ ప్రాజెక్ట్ కింద 30 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా జిల్లాలోని ఇల్లంతకుంట మండలంలో 15 వేలు, సిద్దిపేట జిల్లా, కరీంనగర్ జిల్లాలో మిగతా 15 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందాల్సి ఉంది. ప్రాజెక్ట్‌లోకి రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ నుంచి అన్నపూర్ణకు నీటిని విడుదల చేయాలని రైతులు ఆందోళన చేస్తున్నారు. మిడ్ మానేరు ప్రాజెక్ట్ 27.5 టీఎంసీల సామర్థ్యం ఉన్నా 13.96 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది. గత సంవత్సరం మండుటెండల్లో కూడా కాళేశ్వరం నుంచి మిడ్ మానేరులోకి నీటిని నింపి దిగువ ప్రాజెక్టలలోకి నీటిని మ ళ్లించిన సందర్భాలు ఉన్నాయి. ఈసారి కాళేశ్వరం నుంచి నీటిని మళ్లించే పరిస్థితులు లేక ప్రాజెక్టులు వట్టిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. చెరువుల్లో నీటి నిల్వలు లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో అన్నపూర్ణ ప్రాజెక్ట్ ఆయకట్టుగా ఉన్న అనంతగిరి, సిరికొండ, పెద్దలింగాపూర్, అనంతారం, రహీంఖాన్‌పేట, నారెడ్డిపల్లెలో 5 వేల ఎకరాలకు పైగా పొలాలు పూర్తిగా ఎండిపోయాయి. పశువులకు మేతగా పొలాలను వదిలేస్తున్నారు. మిడ్ మానేరు నుంచి నీటిని విడుదల చేస్తే అన్నపూర్ణ ప్రాజెక్ట్ నుంచి బిక్కవాగుతో పాటు చెరువుల్లోకి నీళ్లు చేరి యాసంగి పంట చేతికి వస్తుందని నీటిని అందించాలని రైతులు ఆందోళనలు చేస్తున్నారు. పంట చేతికి వచ్చే సమయానికి పూర్తిగా పంటలు ఎండిపోతాయని ఆవేదన చెందుతున్నారు.

● జిల్లాలో 1.76 లక్షల ఎకరాల్లో సాగు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతులు యాసంగిలో లక్షా 76 వేల 653 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా వరి లక్షా 73వేల 742 ఎకరాల్లో సాగు చేయగా మొక్కజొన్న 1302.29 ఎకరాలు, జొన్న 2.12 ఎకరాలు, శనగలు 207.31 ఎకరాలు, ఆముదం 6.02 ఎకరాలు, బబ్బెర్లు 25.05 ఎకరాలు, ఎర్రజొన్నలు 67.08 ఎకరాలు, పెసర్లు 63.02 ఎకరాలు, పల్లి 23.23 ఎకరాలు, ఉలువలు 3.35 ఎకరాలు, అవాలు 13.35 ఎకరాలు, పారా గ్రాస్ 10.18 ఎకరాలు, నువ్వులు 242.19 ఎకరాలు, పొద్దు తిరుగుడు 800 ఎకరాలు, పోగాకు 2 ఎకరాలు, గోధుమలు 101 ఎకరాలు, చెరకు 18 ఎకరాలు, ఇతరపంటలు సాగుచేశారు. వ్యవసాయ అధికారులు క్లస్టర్ల వారీగా సర్వేను పూర్తి చేశారు.

● వరిసాగువైపు మొగ్గు

జిల్లాలో చెరువులు, ప్రాజెక్టలతో నీళ్లు ఉండడంతో పాటు బోరు బావులు ఆధారంగా వరిసాగువైపే రైతులు మొగ్గు చూపారు. జిల్లాలో లక్షా .73వేల 742 ఎకరాల్లో వరి సాగుచేశారు. ఇందులో గంభీరావుపేట మండలంలో 17,318.04 ఎకరాలు, ఇల్లంతకుంట 25,024.27, ముస్తాబాద్ 19,903.28, సిరిసిల్ల 4783.13, తంగళ్లపల్లి 18,851.19, వీర్నపల్లి 6204.01 ఎకరాలు, ఎల్లారెడ్డిపేట 16,512.32, బోయినపల్లి 13,079.12, చందుర్తి 15,182.01, కోనరావుపేట 17,141.03, రుద్రంగి 4112, వేములవాడలో 5142.37, వేములవాడ రూరల్ 10,487.11 ఎకరాల్లో వరి సాగు చేశారు.



జిల్లాలో క్రాప్ బుకింగ్ సర్వే చేస్తున్న వ్యవసాయ అధికారి

పంటల సర్వే పూర్తి



- భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి

యాసంగి పంటల సర్వే పూర్తయ్యింది. సర్వే నంబర్ల ప్రకారం పంటల వివరాలు సేకరించాం. వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేశాం. క్షేత్ర స్థాయిలో ఏఈవోలు పంట పొలాల వద్దకు వెళ్లి ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలు అప్‌లోడ్ చేశారు. యాసంగిలో 1,76,653 ఎకరాల్లో పంటలు వేసినట్లు లెక్క తేలింది.

జింక్ లోపంతో ఎరుపు



- వెంకట రామమ్మ, వ్యవసాయ అధికారి, కోనరావుపేట

యాసంగిలో వరికి అగ్గి తెగులు సోకి ఎర్రబడుతోంది. ఇప్పుడు కాస్త తగ్గుముఖం పట్టింది. జింకు లోపంతో కూడా వరి ఎర్రబారుతుంది. రైతులకు జింకును దుక్కిలో కలపాలని అవగాహన కల్పిస్తున్నాం. సౌడ్ నేలతోనూ పొలాలు ఎర్ర బారుతున్నాయి. పొలాల్లో నీరు ఆరబెట్టి మళ్లీ నీరు అందించాలి. అప్పుడు పొలం ఎర్రబారడం తగ్గుతుంది.

7న జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక

- సిరిసిల్ల, వేములవాడలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- శివరాత్రికి రాజరాజేశ్వర స్వామికి పట్టు వస్త్రాల సమర్పణ
- దేవస్థానం మైదానంలో బహిరంగ సభ



సమస్యలు వివరిస్తున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 7న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో చేరుకోని సిరిసిల్ల, వేములవాడలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. సిరిసిల్ల బైపాస్ రోడ్డులో నిర్మించిన జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయ భవనానికి భూమిపూజ చేయనున్నారు. దీంతోపాటు పలు అభివృద్ధి పనులను భూమిపూజ చేయనున్నారు. సిరిసిల్లలో ఎదుర్కుంటున్న వస్త్ర సంక్షోభంపై కార్మిక సంఘాలు, యజమాన్య అసాములతో చర్చించనున్నారు. సిరిసిల్ల నుండి కారులో వేములవాడ కు చేరుకుంటారు. రాజరాజేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించి దర్శించుకుంటారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించి గుడి మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించి రోడ్డు మార్గంలో తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారు.సిరిసిల్ల, వేములవాడ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి జిల్లాకు సంబంధించిన పలు సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి నిధులు, ఇతర అంశాలను చర్చించారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ టౌన్, మార్చి 3: మహాశివరాత్రి జాతర సందర్భంగా రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వేములవాడ దేవస్థానం ఈవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా ఆదివారం ఆయన ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. మహాశివరాత్రి జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవికాలం కావడంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఖాళీ స్థలాల్లో చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా భక్తుల తాగునీటి సమస్య పరిష్కరించేందుకు 100 మీటర్లకు ఒక చోట తాగు నీరు సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాశివరాత్రి రోజున స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు త్వరతగితిన దర్శనం కల్పించేందుకు క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆలయ గుడి చెరువులో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ సౌజన్యంతో శివార్చన స్టేజీని వేయనున్నట్లు తెలిపారు. కళాకారుల ప్రదర్శన చూసేందుకు వీలుగా ఎప్పటిలాగే ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. జాగరణ చేసేందుకు వచ్చే భక్తులకు వీలుగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భక్తులకు స్వామి వారి ఉచిత అన్న ప్రసాదాన్ని అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. సానిటషన్, విద్యుత్‌తో పాటు తిప్పాపూర్ బస్టాండ్ నుంచి రాజన్న ఆలయం వరకు భక్తులకు ఉచితంగా మినీ బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు.

ప్రతిభావంతులకు పోపా పురస్కారాలు



పురస్కారాలతో ప్రతిభావంతులు

సిరిసిల్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీ సామాజిక వర్గంలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు, యువతకు పోపా పురస్కారాలను అందజేశారు. ఆదివారం సిరిసిల్లలోని పద్మశాలీ భవన్‌లో పురస్కారాల ప్రధానోత్సవం నిర్వహించారు. పద్మశాలీ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(పోపా) ఆధ్వర్యంలో పురస్కారాలను పోపా ప్రతినిధులు అందించారు. కొలిపాక కృష్ణ, చాటి శ్రీకాంత్, భానుప్రకాష్, కోడంపూర్ణిమ, అల్లె మహేష్‌కుమార్, బైరి పుష్పలత, వల్లాల మంజుల, ఆర్ కైలాసం, కోడం నారాయణ, సామల శ్వేత, అన్నల్‌దాస్ శ్రీనివాస్, వెల్ది హరిప్రసాద్, నల్ల విజయ్, జక్కని హేమంత్, అడెపు ప్రియాంక, ఎలగొండ అంజనేయులు పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా పోపా ప్రతినిధులు కార్యదర్శి పున్నంచందర్, ఎంఈవో రఘుపతి, గెంట్యాల భూమేష్, కల్లెపల్లి అశోక్, గాజుల ప్రతాప్ మాట్లాడుతూ ప్రతిభ పాటవాలను చాటుతున్న పద్మశాలీలను గుర్తించి మూడు దశాబ్దాలుగా పురస్కారాలను అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దూస శ్రీనివాస్, వాసాల హరిప్రసాద్, భగవాన్, సత్యనారాయణ, శివప్రసాద్, రాంప్రసాద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 3: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణిని పరిపాలన పరమైన కారణాల దృష్ట్యా రద్దు చేసినట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని పేర్కొన్నారు.

క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

ఇల్లంతకుంట, మార్చి 3: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బొల్లవేని రమేష్ అన్నారు. మండలంలోని తిప్పాపూర్‌లో ఆదివారం క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో పోటీలు నిర్వహించడం అభినందనీయన్నారు. క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుందని, యువకులు సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులకు అండగా ఉంటానని తెలిపారు. పోటీలలో అనంతగిరి ప్రథమ, ఇల్లంతకుంట ద్వితీయ స్థానంలో నిలిచాయి.

నిండు జీవితానికి రెండు చుక్కలు

- జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో ప్రారంభం



ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు వారందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలని, రెండు చుక్కలు పోలియోను దూరం చేస్తాయని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. ఆదివారం సిరిసిల్లలోని సుందరయ్యనగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పోలియో రహిత సమాజాన్ని నిర్మించుకోవాలన్నారు. ఆదివారం పల్స్ పోలియో చుక్కలు వేయించని పిల్లలకు 4, 5 తేదీల్లోనూ వైద్య సిబ్బంది చుక్కలు వేస్తారని తెలిపారు. పల్స్ పోలియో చుక్కలు వేయించడంలో నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో పోలియో రాష్ట్ర పరిశీలకుడు గోపాలకృష్ణ, డబ్ల్యూహెచ్‌వో కోఆర్డినేటర్ అతుల్ నిగమే, జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ రజిత, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీరాములు, ప్రోగ్రాం ఆఫీసర్ ఉమ, డాక్టర్ నయూమా, సీడీపీవో అలేఖ్య డాక్టర్ ప్రియాకం పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



సభాస్థలిని పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్, ఎస్పీ అఖిల్‌మహాజన్

వేములవాడ టౌన్, మార్చి 3 : అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 7వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడకు రానున్న సందర్భంగా ఎస్పీ అఖిల్‌మహాజన్, ట్రైనింగ్ ఎస్పీ రాహుల్‌రెడ్డితో కలిసి ఆదివారం రాత్రి సభాస్థలిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ మాట్లాడుతూ మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడలో సీఎం రేవంత్‌రెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు చెప్పారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. జిల్లా అధికారులతో పలు కార్యక్రమాల గురించి చర్చించి నిర్ణయాలు తీసుకున్నామన్నారు. కార్మికులు, నేతన్నలకు ఉపయోగపడే కార్యక్రమాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ద్వారా సాగునీటిని విడుదల చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 9వ ప్యాకేజీ పనులు ముందుకు తీసుకువెళ్లేందుకు, విద్య, వైద్యం, ముంపు గ్రామాల సమస్యల పరిష్కారంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల అంశాలపై సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, జీవన్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తం కుమార్‌రెడ్డితోపాటు ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేకే మహేందర్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కరుణాకర్ సంద్రగిరి శ్రీనివాస్, సాగరం వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన జిల్లా పోలీస్ కార్యాలయం

- 7న ప్రారంభించనున్న సీఎం



ప్రారంభానికి సిద్ధమైన జిల్లా పోలీసు కార్యాలయం

సిరిసిల్ల క్రైం, మార్చి 3: జిల్లా పోలీస్ సూపరింటెండెంట్(బంగ్లా) కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. ఈనెల 7న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. జిల్లాకు ఈనెల 7న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఖరారు కావడంతో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలోనే అంతా సిద్ధమవగా అప్పటి సీఎం చేతుల మీదుగా ప్రారంభించడానికి ప్రయత్నించారు. అప్పటికే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఆగిపోయింది. గార్డెన్ పనులు పూర్తి చేసుకొని ఎట్టకేలకు ఎస్పీ బంగ్లా ప్రారంభానికి అంతా సిద్ధమైంది.

రూ.38.50కోట్లు కేటాయింపు

సిరిసిల్ల పట్టణం రగుడు చౌరస్తా సమీపంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం పక్కన ఎస్పీ బంగ్లా, పరేడ్ గ్రౌండ్, ఏఆర్ హెడ్‌క్వార్టర్, ఎస్పీ నివాసానికి రూ. 38.50 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.19 కోట్లతో జీ ప్లస్-2 విధానంలో ఆధునిక పద్ధతిలో నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని నిర్మించారు. ఈ బంగ్లాలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎస్పీ చాంబర్, రిసెప్షన్, సీసీ, పీఆర్వో, స్టోర్స్, వెయిటింగ్ హాల్, ఫస్ట్ ఫ్లోర్‌లో సూపరింటెండెంట్ రూం, స్పెషల్ బ్రాంచి కార్యాలయం, ఏ, బీ, సీ, ఈ, ఎఫ్, జీ సెక్షన్స్ రికార్డు రూం, ఏఓం రూం, కంట్రోల్ రూం, మినీ కాన్ఫరెన్స్ హాలు, సెకండ్ ఫ్లోర్‌లో ఐటీ కోర్ టీం, ట్రాఫిక్ కమాండ్ కంట్రోల్, డీసీఆర్‌బీ సెక్షన్, క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ రూం, సైబర్ ల్యాబ్, ఉమెన్ పోలీస్ రెస్ట్ రూం, క్యాంటీన్, డిజిటల్ ల్యాబ్, టెర్రస్‌లో కాన్ఫరెన్స్ హాల్, ట్రైనింగ్ రూం, లంచ్ రూం, డిజిటల్ ట్రైనింగ్ రూంలు ఉంటాయి.

నిర్మాణానికి నోచుకోని ఎస్పీ రెసిడెన్సీ, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్

ఎస్పీ రెసిడెన్సీ, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్, పరేడ్ గ్రౌండ్ నిర్మాణానికి నోచుకోలేదు. వీటి నిర్మాణానికి మిగిలిన రూ.19.50 కోట్లు సరిపోవు. అవి నిర్మించడానికి అంచనాలు పెరగడంతో కాంట్రాక్టరు ముందుకు రావడం లేదు. మిగిలిన నిధులతో ఎస్పీ రెసిడెన్సీ, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్, పరేడ్ గ్రౌండ్, బ్యారక్స్, తదితర పనులు చేపట్టాల్సి ఉంది. ఎస్పీ కార్యాలయానికి వెళ్లేందుకు తారు రోడ్డు పూర్తికావాలి.

మల్లికార్జునస్వామి బోనాల జాతర



ఆత్మకూర్‌లో బోనాలతో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 3: మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో యాదవులు మల్లికార్జున స్వామి బోనాల జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మల్లికార్జున స్వామి ఆలయంలోని స్వామి వారికి నిర్వహకులు అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి దర్శనానికి మండలంలోని ఆయా గ్రామాల్లోని నుంచి భక్తులు బారులు తీరారు. భక్తి శ్రద్ధలతో తయారు చేసిన బోనం నెత్తిన ఎత్తుకొని యాదవులు, కురుమ సంఘం సభ్యుల ఒగ్గు డోలు వాయిద్యాలు, శివ సత్తుల నృత్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య శోభాయాత్రగా ఆలయానికి బయలు దేరారు. అనంతరం బోనంతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ, కురుమ సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 3: నగరంలోని అంబేద్కర్ స్టేడియం వద్ద ఇద్దరు వ్యక్తులను అనుమానంతో అదుపులోకి తీసుకోగా వారి వద్ద గంజాయి పట్టుబడిందని ఒకటో థాణా ఎస్ఐ రవి ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ స్టేడియం వద్ద గన్నేరువరం గ్రామానికి చెందిన కొనగాని మధు, మాకొండూర్ మండలం గంగిపెల్లికి చెందిన బల్ల వెంకటేష్ గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేశామని తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్, మార్చి 3: బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జీలుక వెంకటమ్మ(85) కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యానికి గురై నడవలేని స్థితిలో ఇంటి వద్దనే ఉంటోంది. పైగా వృద్ధాప్యం తోడవడంతో జీవితంపై విరక్తి చెందిన శనివారం రాత్రి తన ఇంటి పక్కన ఉన్న చేదబావిలో దూకింది. ఆదివారం తెల్లవారుజామున వెంకటమ్మ శవమై తేలింది. మృతురాలి కుమారుడు కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఓంకార్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులతో పాటు కుమార్తె ఉంది.

ఒంటరితనంతో మహిళ..

గంగాధర, మార్చి 3: గంగాధర మండలం గట్టుబూత్కూర్‌కు చెందిన మహిళ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నేరెళ్ల లక్ష్మి(46) భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. లక్ష్మికి ఒక కూతురు కాగా కరీంనగర్‌కు చెందిన యువకుడితో వివాహం చేసింది. ఇంట్లో ఒంటరిగా ఉంటూ గ్రామంలో కూలీ పనులకు వెళ్తుండేది. పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఒంటరితనం భరించలేక గ్రామ శివారులోని వ్యవసాయ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ తరలించారు.

జీవితంపై విరక్తితో యువకుడు..

ధర్మపురి, మార్చి 3: ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బిసగోని వెంకటేష్ (29) అనే యువకుడు అప్పుల బాధ భరించలేక జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తొమ్మిదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం జగిత్యాలకు వెళ్లిన వెంకటేష్ అక్కడే డ్రైవర్‌గా పని చేశాడు. మద్యానికి బానిసై అప్పుల పాలై స్వగ్రామానికి చేరుకున్నాడు. గ్రామంలో కూడా ఎలాంటి పనిచేయకుండా మద్యం తాగి జీవితంపై విరక్తి చెంది ధర్మపురి పట్టణంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకటేష్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాలువలో పడి యువకుడి మృతి

జ్యోతినగర్, మార్చి 3: స్థానిక మల్కాపూర్ రోడ్డులోని ఎన్టీపీసీ కాలువలో పడి పిట్టల సురేష్(30) అనే యువకుడు మృతిచెందాడు. కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లిన సురేష్ ప్రమాదవశాత్తు కాలువ పడిపోయి చనిపోయాడు. సురేష్ ఫిట్స్‌తో బాధపడుతున్నట్లు సమాచారం. కాలువలో పడిన సమయంలో ఫిట్స్ రావడంతో చనిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలాన్ని ఎన్టీపీసీ పోలీసులు పరిశీలించారు. మృతుడి తల్లి బాయమ్మ ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ హెడ్ కానిస్టేబుల్ ఎండీ ఖాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పిట్టల సురేష్ (ఫైల్)

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, మార్చి3: మండలంలోని బేతిగల్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న డ్రైవర్ రేగుల భాస్కర్, యజమాని బుడిగే భీరయ్యపై కేసు నమోదు చేశారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

వేడెక్కుతున్న రాజకీయాలు


- 7న సిరిసిల్లకు సీఎం రేవంత్‌రెడ్డి రాక
- వేములవాడలో బహిరంగ సభ
- 12న కరీంనగర్‌లో కేసీఆర్ సభ
- కొనసాగుతున్న బీజేపీ ప్రజాహిత యాత్ర

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే రాజకీయ వాతావరణం వేడెక్కుతున్నది. ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లి లోక్ సభ స్థానాల్లో పోటీకి నిలవనున్న అభ్యర్థుల ఎంపిక పూర్తి కాక ముందే అన్ని రాజకీయ పక్షాలు పార్టీ ప్రచారంపై దృష్టి సారించాయి. ఏ పేరుతో సభలు సమావేశాలు ఏర్పాటు చేసినా ప్రధాన ఎజెండా లోక్ సభ ఎన్నికలే. కరీంనగర్ లోక్ సభ స్థానం నుంచి బీజేపీ ఆ పార్టీ సిట్టింగ్ ఎంపీ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేరును పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరన్నది ఇంకా తేలలేదు. పెద్దపల్లి లోక్ సభ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేరును ఖరారు చేశారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులుగా ఎవరిని నిలిపేది ఆ పార్టీల నాయకత్వం ఇంకా ప్రకటించలేదు.

● విస్తృతంగా నేతల పర్యటనలు..

బీజేపీ సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ తన నియోజక వర్గ పరిధిలో ప్రజాహిత యాత్రను చేపట్టి మొదటి విడతను పూర్తి చేసుకుని రెండో విడత పర్యటిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ



నియోజక వర్గాల్లో 119 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రధాన గ్రామాల మీదుగా పట్టణాల మీదుగా ఆయన యాత్ర పూర్తి చేసుకుని ప్రస్తుతం హుస్నాబాద్, హుజూరాబాద్ నియోజక వర్గాల్లో ప్రజాహిత యాత్ర కొనసాగిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం కోసం కాకున్నా ఈ నెల 7న రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనుండడం రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఆయన 7న సిరిసిల్ల జిల్లా ఎస్పీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేసి వేములవాడలో శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకుంటారు. అనంతరం గుడి చెరువు మైదానంలో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు. ఎన్నికల సమయం కావడంతో ఈ బహిరంగసభ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. కరీంనగర్ లోక్ సభ నియోజక వర్గ పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ప్రజలు ఈ బహిరంగ సభలో పాల్గొననున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచార సభగానే దీనిని భావిస్తున్నారు.

ఈ నెల 12న బీఆర్ఎస్ పార్టీ అధినాయకత్వం కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో శంఖారావ సభను నిర్వహించి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ బహిరంగ సభలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న రెండు పార్లమెంటు స్థానాల అభ్యర్థులను ఆయన ఆదివారం ప్రకటించారు. రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ఇప్పటి వరకు ప్రతి కీలక సందర్భంలోనూ కరీంనగర్ ప్రధాన పాత్ర పోషిస్తు వస్తూ ట్రెండ్‌సెట్టర్ జిల్లాగా మారింది. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే రాజకీయ వాతావరణం వేడెక్కడాన్ని ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

ఎండుతున్న పంటలు.. ఆందోళనలో రైతులు

● రాళ్లవాగు కుడికాలువకు గండి పడ్డ ఫలితం ● అడుగంటిన బావులు, చుక్కనీరు రాని బోర్లు ● మరమ్మతుల కోసం రైతాంగం నిరీక్షణ
● రెండు జిల్లాల పరిధిలో ఉండడంతో జాప్యం


భూషణరావుపేట శివారులో పంటల పొలంలో నెర్రెలుబారిన భూమి


నక్కల ఒర్రె వద్ద తెగిన రాళ్ళవాగు కుడికాలువ(ఫైల్)

కథలాపూర్, మార్చి 3: రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువ కింద సాగయ్యే పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వర్షాకాలంలో నీటి ఉధృతి కారణంగా కుడికాలువకు నక్కల ఒర్రె వద్ద గండి పడడంతో నీరంతా వాగులోకి వృధాగా పోతోంది. ఈ నేపథ్యంలో కాలువపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నాయకులు గండిని పూడ్చడానికి నిధులు తెచ్చి మరమ్మతులు చేస్తారని ఆశించిన అన్నదాతకు కష్టకాలం వచ్చిపడింది. పంటలు ఎక్కడికక్కడ ఎండిపోతుండడంతో రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

● అన్నదాత ఆశలకు 'గండి'

నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి మండలంలోని కోనాపూర్ అడవుల్లో నిర్మించిన రాళ్లవాగు ప్రాజెక్ట్ వల్ల జగిత్యాల జిల్లాలోని భూషణరావుపేట, కథలాపూర్, ఊటపల్లి, పెగ్గెర్ల గ్రామాల్లో సుమారు 30 వేల ఎకరాల బీడు భూములకు సాగు నీరు అందుతోంది. కుడి కాలువ సుమారు ఏడు కిలోమీటర్లు ఉండగా ఇందులో రెండు కిలోమీటర్లు కమ్మర్‌పల్లి ఇరిగేషన్ విభాగం పరిధిలో ఉంది. మిగిలిన భాగం జగిత్యాల జిల్లా ఇరిగేషన్ పరిధిలోకి వస్తుంది. గండి పడ్డ ప్రాంతం కమ్మర్‌పల్లి అధికారుల పరిధిలోకి వస్తున్న క్రమంలో అంచనాలు రూపొందించడంలో జాప్యం జరుగుతోంది. దీంతో కుడికాలువ పూర్తిగా జగిత్యాల జిల్లాకు మార్చాలని ఇప్పటికే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులతో చర్చించారు. పూర్తిస్థాయి అంచనాలు వేసి సత్వరమే నివేదిక పంపించాలని ఆదేశించారు. అయితే గండి పడ్డ ప్రాంతంలో మరమ్మతులు చేపడతారేమోననే ఆశతో రబీ సీజన్‌కు సంబంధించి వరి, మిర్చి, మినుము, నువ్వు పంటలు రైతులు సాగు చేసుకున్నారు. ఆ ప్రక్రియకు మోక్షం లభించకపోవడంతో బావులు, బోర్లలో నీళ్లు అడుగంటి సుమారు 200 ఎకరాల మేర పంటలు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ క్రమంలో రైతులు చేసిన లక్షలాది రూపాయల పెట్టుబడులు నష్టపోవాల్సిన దుస్థితి దాపురించింది.

● మూడు ఎకరాల పొలం ఎండిపోయింది..



పచ్చిమట్ల శ్రీనివాస్, రైతు

రాళ్లవాగు కుడికాలువపై ఆధారపడి మూడెకరాల పొలం సాగు చేసుకున్నాను. కాలువ పక్కనే బావి ఉన్నందు వల్ల భూగర్భజలాలు పుష్కలంగా ఉండేవి. అయితే వర్షాకాలం రాళ్లవాగు కాలువకు గండి పడి నీళ్లన్నీ వాగులోకి పడిపోతున్నాయి. దీంతో బావి పూర్తిగా అడుగంటింది. సుమారు రు. 40 వేలతో బావిలో పూడిక తీసినా ఫలితం కనిపించలేదు. లక్ష రూపాయలకుపైగా నష్టం వాటిల్లింది.

● ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారుల సమన్వయం



గడ్డం చిన్నారెడ్డి, రైతు

రెండు జిల్లాల ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేయడానికి ఎమ్మెల్యే ప్రయత్నం చేయడం శుభపరిణామం. ఇప్పటిదాకా తరచూ తెగిపోతున్న కుడి కాలువకు శాశ్వత మరమ్మతులు చేయని కారణంగా రైతుల పరిస్థితి అగమ్యగోచ రంగా మారింది. ఎమ్మెల్యే అసెంబ్లీలో రాళ్లవాగు మరమ్మతులపై ప్రస్తావించిన నేపథ్యంలో కుడి కాలువ మరమ్మతులకు నోచుకుంటుందని ఆశిస్తున్నాము.

బంగారు నగల బ్యాగ్ అప్పగింత


మహిళకు నగలను అందజేస్తున్న ఏసీపీ కృష్ణ, సీఐ

సుల్తానాబాద్, మార్చి 3: ఓ మహిళ తన బంగారు నగల బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోగా, పోలీసులు కొన్ని గంటల్లోనే ఆటోను గుర్తించి బ్యాగ్‌ను బాధిత మహిళకు అందించారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి ఏసీపీ కృష్ణ వివరాల వెల్లడించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం గుమ్లాపూర్ గ్రామానికి చెందిన మండల వసంత తన తల్లిగారి గ్రామమైన సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లికి వచ్చింది. తనకు చెందిన తొమ్మిది తులాల బంగారు నగల బ్యాగ్‌తో ఆదివారం సుగ్లాంపల్లి నుంచి ఆటోలో సుల్తానాబాద్‌కు వచ్చింది. బస్టాండ్‌లో కరీంనగర్ బస్సు ఎక్కే క్రమంలో బంగారు నగల బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయింది. వెంటనే వసంత సుల్తానాబాద్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు గోదావరిఖని, కాల్వశ్రీరాంపూర్, కరీంనగర్, పెద్దపల్లి ప్రాంత పోలీసులను అప్రమత్తం చేసి ఆటోలను తనిఖీ చేయించారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి ఆటోను కరీంనగర్ కలెక్టరేట్ వద్ద గుర్తించి తనిఖీ చేయగా నగల బ్యాగ్ లభ్యమైంది. దాన్ని సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత మహిళ వసంతకు ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ వినీత, అశోక్ రమేష్ తదితరులు అందజేశారు.

ఈతవనం దగ్ధం

కథలాపూర్, మార్చి 3: మండలంలోని తుర్తిలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఈత వనం దగ్ధమైంది. 163 సర్వే నంబర్‌లో సుమారు 3.24 ఎకరాల్లో ఈతవనం ఉండగా స్థానిక గీతకార్మికులు కల్లు గీసుకుని జీవనోపాధి పొందుతున్నారు. అయితే ఈతవనం పూర్తిగా కాలిబూడిద కావడంతో గీతకార్మికులు ఉపాధి కోల్పోయారు. దీంతో తమకు దిక్కుతోచని పరిస్థితి దాపురించిందని బాధిత గీతకార్మికులు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన న్యూరో వైద్యుల రాష్ట్ర సదస్సు


మాట్లాడుతున్న డాక్టర్ ఏకే పురోహిత్

సుభాష్‌నగర్, మార్చి 3: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తు న్న న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సదస్సులో కిమ్స్, నిమ్స్ వంటి ఆసుపత్రులకు చెందిన నిష్ణాతులైన న్యూరో సర్జన్లు, ప్రొఫెసర్లు, రిటైర్డ్ ప్రొఫెసర్లు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన న్యూరో డాక్టర్లు పాల్గొన్నారు. న్యూరో వైద్య చికిత్సలో వస్తు న్న అధునాతన పద్ధతులు, చికిత్స విధానాలు, అత్యాధునిక ఆపరేషన్ విధానాల గురించి వివరించారు. ముగింపు కార్య క్రమంలో డాక్టర్ ఏకే పురోహిత్ ప్రెసిడెన్షియల్ ఓరియంటేషన్ ను అందించారు. డాక్టర్ మానస్ పాణిగ్రహి, డాక్టర్ సుకుమార్ సూర, డాక్టర్ ద్వారకానాథ్‌లు రెనే ఆసుపత్రిలో మెదడులో కంతి తొలగించడం, వెన్నుపాము అత్యాధునిక ఆపరేషన్లను నిర్వహించారు. ఈ సదస్సును డాక్టర్ రమణా రెడ్డి, డాక్టర్ పీవీకే కిషోర్, డాక్టర్ జొన్నల శ్రీనివాస్, డాక్టర్ సంజయ్‌లు పర్యవేక్షించారు.

రుద్రవరం ఆలయాల్లో దొంగల బీభత్సం

వేములవాడ టౌన్, మార్చి 3: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని పలు ఆలయాల్లో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో గ్రామంలోని మల్లన్న స్వామి దేవాలయంలోకి చొరబడి గడ్డపారతో హుండీని పగలగొట్టి నగదును, శ్రీస్వామి వారి వెండి ఆభరణాలను అపహరించారు. హనుమాన్ ఆలయంలో సైతం తాళం పగలగొట్టి హుండీలోని నగదును అపహరించుకుపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. రుద్రవరం గ్రామంలోని ఆలయాల్లో దొంగలు పడి హుండీల్లోని నగదును అపహరించుకు వెళ్లడం ఇది మూడోసారి కావడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారని చెబుతున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో బీజేపీ నాయకుడి మృతి

- పరిహారం చెల్లించాలని నాయకుల డిమాండ్

ఇల్లంతకుంట, మార్చి 3: మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు రంగు రమేష్ (41) విద్యుదాఘాతంతో ఆదివారం మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉండే రమేష్ ఉదయం స్నానం చేసి బట్టలు ఆరవేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. పోలీస్‌స్టేషన్ ప్రహరీకి రమేష్ బట్టలు ఆరవేయడానికి ఇనుప వైరును కట్టుకున్నాడు. ప్రహరీ మీదుగా ఎల్‌టీ లైన్ వెలుతోంది. స్తంభానికి ఉన్న డెడ్‌ఎండ్ వైరు వల్ల విద్యుత్ ప్రసరణ జరిగి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహానికి సిరిసిల్లలో పోస్టుమార్టమ్ నిర్వహించి ఇంటికి తీసుకువస్తుండగా బీజేపీ నాయకులు రహీంఖాన్‌పేట గ్రామానికి చేరుకొని వాహనాన్ని నిలిపివేశారు. రమేష్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తరలించేది లేదని తేల్చిచెప్పారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ప్రశాంత్‌రెడ్డి సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డికి సమాచారం అందించారు. సెస్ డైరెక్టర్ చేరుకొని పోస్టుమార్టమ్ రిపోర్టు ఆధారంగా సెస్‌సంస్థ తరపున పరిహారం అందించడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.


రమేష్ (ఫైల్)

కుటుంబీకులకు సెస్‌సంస్థలో ఉద్యోగం ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. తనపరిధిలో లేనందున తగిన విధంగా అండగా ఉంటానని సెస్ డైరెక్టర్ హామీ ఇవ్వడంతో శాంతించారు. కార్యక్రమంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బెంద్రం తిరుపతిరెడ్డి, నాగసముద్రాల సంతోష్, బత్తిని స్వామి, తిప్పారపు శ్రావణ్, మ్యాకల మల్లేశం, దెశెట్టి శ్రీనివాస్, సాయగౌడ్, పున్ని రాజు, వజ్జపల్లి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- 5కే రన్‌కు భారీ స్పందన
- మాధక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతిజ్ఞ
- హాజరైన యువతీ, యువకులు
- బహుమతులు అందజేసిన కలెక్టర్, ఎస్పీ

సిరిసిల్ల క్రైం, మార్చి 3: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఆదివారం ఉదయం నిర్వహించిన 5కే రన్‌కు భారీ స్పందన లభించింది. 5కే రన్‌లో పాలుపంచుకున్న యువతీ, యువకుల్లో ఉత్సాహం, ఉల్లాసం కనిపించింది. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎస్పీ అఖిల్ మహాజన్ జెండా ఊపి 5కే రన్‌ను ప్రారంభించారు. అంబేద్కర్ చౌరస్తా, నేతన్నచౌక్, కొత్తచెరువు, చంద్రంపేట మీదుగా తిరిగి అంబేద్కర్‌చౌరస్తా వరకు సాగింది. 5కే రన్‌లో ఓపెన్ కేటగిరిలో రాహుల్, బాలయ్య, సురేష్, (వీర్నపల్లి), విజయ్‌కుమార్, వకీల్ (రుద్రంగి), రజినీకాంత్, రాజు(ఎల్లారెడ్డిపేట), వినోద్‌కుమార్(రంగినేని ట్రస్టు, సిరిసిల్ల), మహిళల కేటగిరిలో హారిక, మౌనిక, విశాల, మౌనిక (తంగళ్లపల్లి), పోలీస్ విభాగంలో దేవరాజు(ఏఆర్ హెడ్‌క్వార్టర్), శంకర్ (ఎల్లారెడ్డిపేట), రవికుమార్ (మీడియా) విజేతలుగా నిలిచారు. విజేతలకు కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ బహుమతులు, 13 సైకిళ్లు అందజేశారు.

● యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం

- కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్

మాధక ద్రవ్యాలను నిర్మూలించి యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. 5కే రన్‌లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువతేనన్నారు. అలాంటి యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తుపదార్థాలకు బానిసలై వారి భవిష్యత్తుని అంధకారంలోకి నెట్టేసుకుంటున్నారన్నారు. భావిజీవితానికి అవరోధంగా నిలుస్తున్న మత్తు పదార్థాలను సమాజం నుండి పూర్తిగా నిర్మూలించడానికి ప్రతీ ఒక్కరు నడుం బిగించాలన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు.

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ యువత పురోగతికి అవరోధంగా నిలుస్తున్న గంజాయి, ఇతర మత్తుపదార్థాలను నియంత్రించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. డ్రగ్స్, గంజాయిని నిర్మూలించడంలో భాగస్వామ్యం కావాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై అనారోగ్యం పాలవుతూ బంగారు భవిష్యత్తును కోల్పోవడమే కాకుండా ఎన్నో చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు చేస్తూ తమ చేతలారా భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారన్నారు. మత్తుపదార్థాలను నిర్మూలించి యువతను మత్తు అనే మహమ్మారి నుంచి కాపాడుకోవాలన్నారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు అన్ని కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులతో యాంటీ డ్రగ్స్ క్లబ్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించామన్నారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయికి అలవాటు పడిన వారిని సన్మార్గంలో నడిపించడానికి డి-అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటుచేసి మానసిక వైద్యుల ద్వారా చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా మీడియా ప్రతినిధుల పాత్ర అంత్యంత కీలకమని, యువత గంజాయి, డ్రగ్స్, తదితర మత్తు పదార్థాల బారిన పడితే కలిగే అనర్థాలపై మీడియా ద్వారా అవగాహన కల్పించాలన్నారు. 5కే రన్ నిర్వహణకోసం కృషిచేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ డిఎస్పీలు భీం శర్మ, నాగేంద్రచారి, సీఐలు రఘుపతి, కరుణాకర్, శ్రీనివాస్, కిరణ్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, క్రీడాకారులు పాల్గొన్నారు.


5కె రన్‌లో పాల్గొన్న ఎస్పీ, చిన్నారులు


విజేతలకు సైకిళ్లను అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

కవయిత్రి భాగ్యలక్ష్మికి సన్మానం



భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న జడ్జి

సిరిసిల్ల రూరల్, మార్చి 3: ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉదయ సాహితీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవయిత్రుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి భాగ్యలక్ష్మిని కరీంనగర్ జిల్లా సివిల్ కోర్టు జడ్జి సరళాదేవి సన్మానించారు. ఉదయ సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు ధాస్యం లక్ష్మయ్య కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎర్రం రాజారెడ్డి, కార్యదర్శి మేజరేల్ల సంజీవ్ పాల్గొన్నారు.

దర్గాలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రార్థనలు



పెద్దగుట్టలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పెద్దగుట్ట మజరత్ సయ్యద్ షాదుల్లా హ హస్సేన్ బాబా దర్గాలో ఆదివారం సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణితో పాటు మైనార్టీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పోచమ్మతల్లికి చలి బోనాలు



చలి బోనాలు తీస్తున్న మహిళలు

గంభీరావుపేట, మార్చి3: గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌లో నల్ల పోచమ్మ చలి బోనాలు తీశారు. ప్రజలు సంతోషంతో చల్లగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని పిల్ల పాపలు ఆరోగ్యంగా ఉండాలని పోచమ్మ తల్లిని వేడుకున్నారు. నాయకులు రమేష్, సతీష్, విష్ణు, నర్సింలు, ప్రవీన్, ఎల్లయ్య, విజయ్, సుధాకర్ ఉన్నారు.

బీసీ వసతి గృహాన్ని పున:ప్రారంభించాలి

గంభీరావుపేట, మార్చి 3 : గంభీరావుపేట మండల కేంద్రంలో మూత బడిన బీసీ వసతి గృహాన్ని తిరిగి ప్రారంభించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం మంత్రికి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం కేజీ టూ పీజీ క్యాంపస్ ఉండడంతో దూర ప్రాంతాల నుంచి చాల మంది విద్యార్థులు విద్యనభ్యసించేందుకు వస్తున్నారని పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నేతలు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 3: మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా శనివారం నిర్వహించడంతో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వేడుకలకు ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. మంత్రి శ్రీధర్ బాబును బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య సింగిల్ విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్ కలిశారు.

ప్రభుత్వాస్పత్రి ఆవరణలో అన్నదానం

సిరిసిల్ల టౌన్, మార్చి 3: సిరిసిల్ల పద్మశాలీ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల ఆవరణలోని సత్యసాయి సేవా సమితిలో రోగుల అటెండర్లకు గోలి వెంకటరణమ అన్నదానం చేశారు. సంఘం ఉపాధ్యక్షులు మోర రవి, గాజుల బాలయ్య ప్రధాన కార్యదర్శి మండల సత్యం, సహాయ కార్యదర్శి రాపెల్లి ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్లు ఆడెపు జగన్, మచ్చ యశ్వంత్, గుడ్ల వెంకటేశం, దాసరి వెంకటేశం, శ్రీరాముల వెంకటేశం, మాదాసు శ్రీనివాస్, చింతకింది మల్లికార్జున్, గోరిట్యాల మధు, గౌడ అంజనేయులు, గజ్జెల్లి లక్ష్మిపతి, గుంగుల శ్రీనివాస్, చౌటపెల్లి వెంకటేశం, కోడం శ్రీనివాస్, సామల రామచంద్రం, గున్నాల దేవదాస్, పంతం శ్రీనివాస్, గూడూరి సంతోష్, పేరాల రవీందర్, గుజ్జె రాజేంద్రప్రసాద్, వేముల మురళి, కృష్ణయ్య, సామల రాములు, మేర్గు అంజనేయులు, కట్ల సతీష్, మహేష్, కల్లెపెల్లి శ్రీనివాస్, రాజయ్య, మనోహర్, బొద్దుల శ్రీనివాస్, అంబదాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 3: ఎల్లారెడ్డిపేట సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ గౌడ్‌ను కాంగ్రెస్ మండల నాయకులు ఆదివారం సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజేందర్, సోషల్ మీడియా కన్వీనర్ రాజునాయక్ ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ముస్తాబాద్, మార్చి 3: ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. రూ. 1500 నగదు, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గంభీరావుపేట శ్రీకృష్ణ యాదవ సంఘం

గంభీరావుపేట, మార్చి 3: గంభీరావుపేట శ్రీకృష్ణ యాదవ కమిటీ నూతన సంఘం ఆదివారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా మాడుగుల రాజయ్య, ఉపాధ్యక్షులుగా గుడికాడి మహేష్, కోట పెద్ద భూమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆసరి రవి, కోశాదికారిగా గుడికాడి రాములు, సలహాదారులుగా ఎల్లయ్య, బుచ్చయ్య యాడారపు రాజం ఎన్నికయ్యారు.

కేకే మహేందర్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకోం

ముస్తాబాద్, మార్చి 3 : కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని విమర్శిస్తే ఉరుకునేది లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఇష్టారీతిలో మాట్లాడితే ఉరుకునేది లేదన్నారు. బీఆర్ఎస్ నేతల దందాలు ప్రజలకు తెలుసని చేసిన తప్పులు కప్పి పుచ్చుకోవడానికి కేకేపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. కేటీఆర్ మెప్పు కోసం తోట ఆగయ్య అనవసర ఆరోపణలు చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కనమేని చక్రధర్‌రెడ్డి, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, తలారి నర్సింలు, రంజాని నరేశ్, మిరుదొడ్డి భాను, కొండయ్య, వంశీగౌడ్, ముచ్చర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నేతలు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 3: మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించడంతో ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. మంత్రి శ్రీధర్ బాబును బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య సింగిల్ విండో వైస్ చైర్మన్ కృష్ణ మూర్తి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్ కలిశారు.

లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఎస్పీ పూజలు

బీర్‌పూర్, మార్చి 3: బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఆదివా రం జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ప్రత్యేక పజలు ని ర్వహించారు. ఈ సంద ర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎస్పీకి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసా దాలు అందించి ఆశీర్వచనాల ను ఇచ్చారు. ఆయన వెంట ఉత్సవ కమిటీ చైర్మన్ ఎనగంటి స్వామీట్, బీర్ పూర్ ఎస్సై గౌతమ్ పవర్, అర్చకులు సంతోష్, మధు కుమార్, సంతోష్, సి బ్బంది రాజయ్య, వెంక టేష్ ఉన్నారు.

బియ్యం అందజేత

తంగళ్లపలి, మార్చి 3 : కొద్ది రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న తంగళ్లపలి మండలం సారంపల్లికి చెందిన బొప్పెన పర్శరాములు కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు ఆదివారం బియ్యం అందజేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రాజు, కాంగ్రెస్ మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుగ్గిళ్ల భరత్‌గౌడ్ , కునవేణి వినోద్, సిరిసిల్ల దేవదాస్, బొప్పెన రాజు పాల్గొన్నారు.

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట): ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సిబ్బంది నర్సింలు కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు 50 కిలోల బియ్యాన్ని ఆదివారం అందించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెన్నిబాబు, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోపాల్ పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఇల్లంతకుంట, మార్చి 3: పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి రజిత అన్నారు. మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయాలతోపాటు మండలకేంద్రంలోని బస్టాండ్‌లో ఆదివారం పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా వేయించకపోతే వైద్యసిబ్బంది ఇంటింటికీ వచ్చి పోలియో చుక్కలు వేస్తారన్నారు. అనంతరం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన జిల్లా వైద్యాధికారి పలు సూచనలు చేశారు. డిప్యూటీ జిల్లా వైద్యాధికారి శ్రీరాములు, వైస్ ఎంపీపీ సుదగోని శ్రీనాథ్‌గౌడ్, వైద్యాధికారి శరణ్య, ఎంపీటీసీలు ఒగ్గు నర్సయ్యయాదవ్, కరివెద స్వప్నకర్ణాకర్‌రెడ్డి, కాథ సమలతమల్లేశంలతో పాటు వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్దాపూర్, భూపతినగర్, ఇప్పల్లపల్లె, దూప్యానాయక్‌తండా, మాలపల్లె, తుర్కాకాశీకాలనీ, బాబాజీకాలనీల్లో ఆదివారం కౌన్సిలర్లు చిన్నపిల్లలకు పల్స్ పోలియో చుక్కలను వేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లింగంపల్లి సత్యనారాయణ, చెన్నమనేని కీర్తికమలాకర్‌రావు, కల్లూరి లతమధు, బోల్గం నాగరాజుగౌడ్, బుర్ర లక్ష్మీశంకరయ్య, పాతూరి రాజిరెడ్డి, పోచవేణి సత్యఎల్లయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అయింది. 32 బూత్‌ల ద్వారా ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమం పోత్గల్ వైద్యాధికారి డాక్టర్ బత్తుల గీతాంజలి ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. 0-5 సంవత్సారాల లోపు చిన్నారులు 3209 మందికి పోలియో డ్రాప్స్ వేశారు.



పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీ వైస్ చైర్మన్

ఈకార్యక్రమంలో ఎంపీపీ జనగామ శరత్‌రావు, జడ్పీటీసీ గుండం నర్సయ్య, వైద్య సిబ్బంది, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీపీ పిల్లి రేణుక, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి, మండల వైద్యాధికారులు స్రవంతి, బాబు పాల్గొన్నారు.

వీర్నపల్లి: నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలని ఎంపీపీ మాలోతు భూల అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామ పంచాయతీలలో వైద్య సిబ్బందితో కలిసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు.

తంగళ్లపల్లి: ఐదు సంవత్సరాలలో పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని ఎంపీపీ పడిగెల మానసరాజు సూచించారు. ఆదివారం తంగళ్లపలి మండల కేంద్రంలోని పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వేములవాడ రూరల్: మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం పోలియో కేంద్రాలలో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. హన్మాజిపేటలో ఎంపీటీసీ శ్యామల, ఎంపీడీవో రమేష్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 లోపు పిల్లలందరికి పోలీయోచుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తో పాటు వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎమ్‌లు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

చందుర్తి: పోలియో రహిత సమాజనిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీపీ బైరగోని లావణ్య అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో చుక్కల మందు కార్యక్రమాన్ని ఆదివారం జడ్పీటీసీ నాగంతేకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సంపత్ కుమార్, ఎంపిటిసి పులి రేణుక సత్తయ్య, ఏఎస్ఎం రమ, వైద్య సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతమైంది. కోనరావుపేట మండలం కేంద్రంలో ఎంపీపీ చంద్రయ్యగౌడ్, వైద్యాధికారి వేణుమాధవ్ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుమత, కోనరావుపేట ఎంపీటీసీ చారి, ఏఎస్ఎంలు, అశావర్కర్‌లు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ.. ఆరోగ్యం

వేములవాడ టౌన్, మార్చి 3: ఆత్మరక్షణతోపాటు ఆరోగ్యానికి కరాటే దోహదం చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి 4వ ఓపెన్ కరాటే పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే శిక్షణతో విద్యార్థుల్లో ఏకాగ్రత, పట్టుదల, ఆత్మస్థైర్యం, మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం పెరుగుతాయన్నారు. నిర్వాహకులు ఎంఏ మన్నాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాదవిరాజు, నాయకులు కొండ దేవయ్య, గోగికారి శ్రీనివాస్ దండుగల తిరుపతి, విజేంద్రచారి, శివరాత్రి రాజు తదితరులు ఉన్నారు.

● వేములవాడలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి నాలుగో ఓపెన్ కరాటే పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులకు నిర్వాహకులు, ఎంఏ మన్నాన్, సీనియర్ కరాటే శిక్షకుడు సంపత్‌కుమార్ విజేతలకు మెడల్స్ అందజేశారు. మొదటి, రెండు, మూడు, నాలుగో స్థానంలో నిలిచిన క్రీడాకారులకు పథకాలను అందజేశారు.



మెడల్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మహాశివరాత్రి ఆహ్వాన పత్రిక అందజేత



పత్రిక అందజేస్తున్న ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ టౌన్, మార్చి 3: వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రికను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ అందజేశారు. వేములవాడ పట్టణంలోని ఆది శ్రీనివాస్ నివాసంలో ఆదివారం ఉదయం పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఈ నెల 7వ తేది నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించే శివరాత్రి జాతరను విజయవంతం చేయాలన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

రుద్రంగి, మార్చి 3: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదుగాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రే ప్రభలతమనోహర్, గంగ మల్లయ్య, పాఠశాల కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకట్ రెడ్డి, ఏర్రం గంగనరసయ్య, పడాల సురేష్ ప్రిన్సిపాల్ హరినాథ్‌రాజు, తదితరులు పాల్గొన్నారు

పార్లమెంట్ ఎన్నికల ముందే కార్పొరేషన్ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొండ దేవయ్య

సిరిసిల్ల టౌన్, మార్చి 3: పార్లమెంట్ ఎన్నికల ముందే మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రకటించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ సాధన కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరు సమావేశంలో మాట్లాడారు. మున్నూరు కాపు కార్పొరేషన్ కోసం పది సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామన్నారు. మున్నూరు కాపు కుల అభివృద్ధి కోసం పాటుపడాలని, గత ప్రభుత్వానికి సంఘం పక్షాణ విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి పోరాటాలు చేస్తున్నా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని కోరారు. ప్రతీ జిల్లాలో రెండు ఎకరాల భూమి, రూ.3 కోట్ల నిధులు మంజూరు చేసి విద్యార్థులకు హాస్టల్స్ నిర్మాణానికి సహకరించాలన్నారు. హైదరాబాద్ కోకాపేటలో మున్నూరు కాపు సంఘం ఆత్మగౌరవ భవనం కోసం భూమి గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చారని, ఆ భూమిలో గుట్టలు ఉండడంతో వాటిని తొలగించడానికి సుమారు రూ. 15 కోట్లు అవుతుందని అన్నారు. భవన నిర్మాణం కోసం కేసీఆర్ ఇచ్చిన రూ. 5 కోట్లు సరిపోవని తీసుకోలేక పోయామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మగౌరవ భవనం నిర్మాణంకు రూ. 20 కోట్లు మంజూరు చేయాలన్నారు. మున్నూరు కాపు బిడ్డ వేములవాడ నియోజకవర్గం శాసనసభ్యుడు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇచ్చి మున్నూరు కాపులను గౌరవించాలన్నారు. జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, సీతక్క మున్నూరు కాపు ఫైనాన్స్ మంజూరుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు బండి సంజయ్, నాయకులు ఎడ్ల రవి, ఆర్‌వి మహేందర్‌కుమార్, చింతపండు మహేందర్, నీలి శంకర్, కల్లూరి రాజు, అగ్గిరాములు, రవి, బండారి శ్యాం, గుర్రం శ్రీనివాస్, ఆకుల సత్యనారాయణ, ఎర్రం మల్లయ్య కొడిమ్యాల వేణు, లక్ష్మన్, భూమేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం



కోనరావుపేటలో పూర్వ విద్యార్థులు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట) మార్చి 3: ఎల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988 -89 ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులను సన్మానించారు. తాజా మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి, బొమ్మకంటి రుక్మయ్య, రాపెల్లి అంబదాస్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట, మామిడిపల్లిలో...

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంతో పాటు మామిడిపల్లి సీతారామచంద్రస్వామి ఆలయ అవరణలో ఆదివారం పూర్వ విద్యార్థులు కలుసుకోని తమ ఆత్మీయ విశేషాలను పంచుకున్నారు. కోనరావుపేట ప్రభుత్వం పాఠశాలలో 2004 -05 పూర్వ విద్యార్థులు, 2005 -06కు వెంకట్రావుపేట, బావుసాయిపేట, మామిడిపల్లి గ్రామాల పూర్వ విద్యార్థులు మామిడిపల్లి ఆలయంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు.

హైదరాబాద్ తరలిన బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశానికి జిల్లా నుంచి ఆ పార్టీ ముఖ్య నాయకులు తరలివెళ్లారు. కరీంనగర్ కేంద్రంలో ఈ నెల 12న నిర్వహించనున్న బహిరంగ సభతోపాటు జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. జిల్లా నుంచి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు జడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, నాయకులు రామతీర్థపు రాజు, గడ్డం నాగరాజు, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.



కేసీఆర్‌తో జడ్పీ చైర్‌పర్సన్ అరుణ

అన్ని రంగాల్లో మండల అభివృద్ధి

చందుర్తి, మార్చి 3: చందుర్తి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, మొదటి స్థానంలోకి తీసుకెళ్తానని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో పల్లె దావఖానా, మహిళా సమాఖ్య భవన, సీసీ రోడ్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. తన గెలుపు కోసం కృషి చేసిన వారిని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానన్నారు. జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, ఎంపీపీ బైరగోని లావణ్య నాయకులు ముసుకు పద్మ మల్లారెడ్డి, ముకుంద రెడ్డి, మ్యాకల గణేష్, చింతపంటి రామస్వామి, రమేష్, సత్యం పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఆది శ్రీనివాస్

ఫ్రెండ్స్ క్లబ్ అదనపు భవన నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న జడ్పీటీసీ మంజుల

తంగళ్లపల్లి, మార్చి 3: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఫ్రెండ్స్ క్లబ్ భవనం అదనపు పనులతోపాటు ఆదర్శ యూత్ క్లబ్ భవనం అదనపు నిర్మాణాలకు జడ్పీటీసీ పూర్మాణి మంజుల లింగారెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిధులు మంజూరు చేసిన మం త్రి ఉత్తమ కుమార్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు ఎడమల శ్రీధర్ రెడ్డి, సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్, నాయకులు వైద్య శివప్రసాద్, మోర లక్ష్మిరాజం, మచ్చ శ్రీనివాస్, సామల రమేష్ నేరెళ్ల నర్సింగం గౌడ్, గుగ్గిల శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, వాసు పాల్గొన్నారు.

కేటీఆర్‌తోనే వస్త్ర పరిశ్రమలో సంక్షోభం

సిరిసిల్ల టౌన్, మార్చి 3: సిరిసిల్ల పవర్‌లూం పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లడానికి ప్రధాన కారణం మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ పాపాలేనని లాల్ బహుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీవైనగర్ చౌరస్తా వద్ద సిరిసిల్ల పవర్‌లూం పరిశ్రమ నిరవధిక బంద్ పోస్టర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం నివారణకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. బకాయిలు, యారన్ సబ్సిడీని వెంటనే చెల్లించాలన్నారు. వర్కర్ టూ ఓనర్ పథకానికి నిధులు కేటాయించాలన్నారు. వెంటనే పనులు పూర్తి చేసి అర్హులైన కార్మికులకు ఇవ్వాలన్నారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి వెల్లడానికి ప్రధాన కారణమైన కేటీఆర్ కార్మికులకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 6న నుంచి నిర్వహించనున్న పవర్‌లూం పరిశ్రమ నిరవధిక బంద్‌లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. నాయకులు అజ్జ వేణు, నల్ల చంద్రమౌళి, నల్ల మార్కండేయులు, కొంక విజయ్, రాజమల్లు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి ఆవరణలో అన్నదానం

సిరిసిల్ల టౌన్, మార్చి 3: సిరిసిల్ల పద్మశాలీ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల ఆవరణలోని సత్యసాయి సేవా సమితిలో రోగుల అటెండర్లకు గోలి వెంకటరణమ అన్నదానం చేశారు. సంఘం ఉపాధ్యక్షులు మోర రవి, గాజుల బాలయ్య ప్రధాన కార్యదర్శి మండల సత్యం, సహాయ కార్యదర్శి రాపెల్లి ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్లు ఆడెపు జగన్, మచ్చ యశ్వంత్, గుడ్ల వెంకటేశం, దాసరి వెంకటేశం, శ్రీరాముల వెంకటేశం, మాదాసు శ్రీనివాస్, చింతకింది మల్లికార్జున్, గోరిట్యాల మధు, గౌడ అంజనేయులు, గజ్జెల్లి లక్ష్మిపతి, గుంగుల శ్రీనివాస్, చౌటపెల్లి వెంకటేశం, కోడం శ్రీనివాస్, సామల రామచంద్రం, గున్నాల దేవదాస్, పంతం శ్రీనివాస్, గూడూరి సంతోష్, పేరాల రవీందర్, గుజ్జె రాజేంద్రప్రసాద్, వేముల మురళి, కృష్ణయ్య, సామల రాములు, మేర్గు అంజనేయులు, కట్ల సతీష్, మహేష్, కల్లెపెల్లి శ్రీనివాస్, రాజయ్య, మనోహర్, బొద్దుల శ్రీనివాస్, అంబదాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట, మార్చి 3: బీజేపీ కరీంనగర్ ఎంపీ టికెట్ బండి సంజయ్ కుమార్‌కు కేటాయించడంపై వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాలకు చెందిన ఆపార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డిపేట మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి, వీర్నపల్లి మండల అధ్యక్షుడు గునుగుల దేవేందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు దాసరి గణేష్, కృష్ణ హరి, జిల్లా అధికార ప్రతినిధి బందారపు లక్ష్మారెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సాయికిరణ్ నాయక్, వీర్నపల్లి మండలం మాజీ అధ్యక్షులు బోడ మల్లేశం, బూత్‌అధ్యక్షులు గాజుల దాసు, పారిపల్లి సంజీవరెడ్డి, ప్రకాష్ నాయక్, బుర్ర వేణు భాస్కర్ రెడ్డి, దీటి నర్సయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: కరీంనగర్ పార్లమెంటరీ బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్‌కుమార్‌ను ప్రకటించడంపై ముస్తాబాద్ మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక వివేనంద కూడలిలో నాయకులు సంబరాలు జరిపారు. టపాసులు పేల్చారు. పార్టీమండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్, పెంజర్ల కళ్యాణ్, తిరుపతియాదవ్, మీస సంజీవ్, మీస స్వామి, సత్తయ్య, చిట్నేని శ్రీనివాస్‌రావు, ఎదునూరి గోపి, అజయ్ పాల్గొన్నారు.

కోనరావుపేట : కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్‌ను కేటాయించండంతో కోనరావుపేట మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఆదివారం టపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు గోపాడి సురేందర్‌రావు, గొట్టె రామచంద్రం, జొన్న అనిల్, ముష్కం శ్రీనివాస్, మోత్కు మోహన్ పాల్గొన్నారు.

చందుర్తి : కరీంనగర్ పార్లమెంట్ సభ్యునిగా బీజెసీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ గెలుపు ఖాయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ బీజేపీ పార్లమెంటు అభ్యర్థిగా మరోసారి బండి సంజయ్‌కి టికెట్ ఇవ్వడంతో చందుర్తి మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బండి సంజయ్‌ని ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు పొంచెట్టి రాకేష్, నాయకులు మోతే రాములు, చిర్రం తిరుపతి, చింతకుంట సాగర్, ఆది రవి, వంకాయల కార్తీక్, అయోధ్య పరశురాములు, తిరుపతిరెడ్డి ,తిరుమల్ రెడ్డి ,పత్తిపాక మల్లయ్య, గడికొప్పుల జీవన్, గణేష్, సిరికొండ తిరుపతి, మేడిశెట్టి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



సంబరాల్లో బీజేపీ నాయకులు